క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

వి.కోట: మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా ఆదివారం వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కుమారస్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు మార్గశిర శుద్ధ త్రయోదశి తిథి నాడు నిర్వహించే హనుమద్వ్రైతాన్ని వివరించారు. లంకలో ఉన్న సీతాదేవిని ఆంజనేయుడు కనుగొన్న శుభదినమే మార్గశిర శుద్ధ త్రయోదశి అని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చర్చిలకు పట్టాల పంపిణీ



చర్చిలకు పట్టాలు పంపిణీ చేస్తున్న జాఫర్

పలమనేరు : పట్టణంలోని పలు చర్చిలకు శాశ్వత హక్కును కల్పిస్తూ ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను ఫాదర్లకు ఆదివారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాఫర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు మసీదులు, చర్చిలు, కొన్ని ఆలయాలకు పట్టాలు లేవని స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడకు విన్నవించామన్నారు. ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన పట్టాలను ఇప్పటికే స్థానిక మసీదులకు పంపిణీ చేశామన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు చర్చిలకు పట్టాలను ఇచ్చామని తెలిపారు. అదే విధంగా పట్టణంలోని పట్టాలు లేని ఆలయాలకు సైతం త్వరలోనే పట్టాలను ప్రభుత్వం అందించనుందని తెలిపారు.

ఘనంగా గీతా జయంతి



బహుమతులందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని బసవన్న ఆలయంలో ఆదివారం గీతా జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన తేజస్వి, పల్లవి అనే ఉపాసకులు మూడేళ్లుగా ఇక్కడి పిల్లలకు భగవద్గీతను నేర్పుతున్నారు. గీతా జయంతి సందర్భంగా ఇక్కడి పిల్లలకు స్థానిక అక్కమహాదేవి మహిళా మండలి సభ్యులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు శిక్షకులను సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో ఆదివారం దేవదాయ ధర్మదాయశాఖ ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరుపతికి చెందిన ప్రజాపతి చారిటబుల్ ట్రస్ట్ వారు 40 మంది కళాకారులతో భరతనాట్యం, కూచిపూడి, నృత్యప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణ స్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఆలయంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పలు ప్రారంభోత్సవాలు



పెద్దయల్లకుంట్ల సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చౌడేపల్లెలో వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పనులను చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలిచి ఆదరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. ఆయన ఆదివారం చౌడేపల్లె మండలంలోని 14 పంచాయతీల్లో పర్యటించి రూ.13 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, జగనన్న పాల వెల్లువ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ, ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభించారు.

ప్రతి గ్రామానికీ రోడ్డు

మండలంలో ప్రతి గ్రామానికీ రోడ్లు వేశామని, ప్రతి వీధిలోనూ సీసీరోడ్లు నిర్మించామని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో మురుగు కాలువలు చేపట్టామన్నారు. ఎన్నికల ముందు వచ్చే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాలకు మద్దతునివ్వాలని కోరారు.

ప్రజలకు సేవచేసి మంచిపేరుతేవాలి

ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, సేవలను అర్హులకు అందించి మంచి పేరు తీసుకురావాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి సూచించారు. ప్రజలకు సేవ చేస్తే జీవితాంతం గుర్తు పెట్టు కుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డు రమణ, డీసీసీబీ డైరెక్టర్ రమేష్ నాయుడు, చిన్నప్ప, సర్పంచులు లక్ష్మీదేవి, భాగ్యవతి, జయ సుధమ్మ, నాగరత్న, సరితారెడ్డి, కృష్ణారెడ్డి, హైమావతి, అనూరాధ, రఘురామిరెడ్డి, వరుణ్‌భరత్, విజియకుమారి, సరస్వతమ్మ, రిజ్వానా, ఎంపీటీసీలు శ్రీరాములు, లక్ష్మీనర్సయ్య, షహీనా, జ్యోతమ్మ, మునెమ్మ, రూపారేఖ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పెద్దయల్లకుంట్ల గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం అనంతరం విజయవాణి ప్రింటర్స్, విద్యా సంస్థల యజమాన్యం నాయుని చంద్రశేఖరమూర్తి, గురుశేఖరమూర్తి, సుధాకర మూర్తి ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరం వైఎస్సార్ సీపీ క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మంత్రి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. దుర్గసముద్రం, బిల్లేరు సబ్ స్టేషన్ల వద్ద మంత్రి మొక్కలు నాటారు. మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావారణాన్ని పొందవచ్చన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయని, ప్రజలు విధిగా మొక్కలు పెంచాలని సూచించారు.



ఉత్సాహంగా మైలేరు పండుగ



వెంగంవారిపల్లెలో పరుగు పందెంలో దూసుకెళ్తున్న పశువు

బైరెడ్డిపల్లె : మండలంలోని వెంగంవారిపల్లెలో ఆదివారం మైలేరు పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. గ్రామస్తులు ఉదయం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పశువులను శుభ్రం చేసి విశేషంగా అలంకరించారు. పరుగు పందెం బరిలో వదిలిపెట్టారు. పశువులకు సినిమా పేర్లు, జంతువుల పేరు, సినీ హీరోల పేర్లు పెట్టారు. వాటిని పట్టుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. పరుగుపందెంలో విజేతలుగా నిలిచిన పశువులకు బహుమతులు అందజేశారు. యువత అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతం జనసందోహంతో కిక్కిరిసింది.

కోలాహలం

మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డి గారిపల్లెలో ఆదివారం ముందస్తు పశువుల పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. ముందుగా పశువులకు పూజలు చేసి అలంకరించారు. అనంతరం గ్రామంలో వదిలిపెట్టారు. వాటిని పట్టుకోవడానికి యువకులు ఉత్సాహంతో ముందుకొచ్చారు. ఈ పండుగను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

– పులిచెర్ల(కల్లూరు)



గణిత ప్రజ్ఞాధారణలో విద్యార్థుల ప్రతిభ



గణిత ప్రజ్ఞాధారణలో ప్రతిభ చాటి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణలో ప్రతిభ చాటారని గణిత అవధాన గురువు, ఏపీ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం కడప జిల్లా మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గణితోత్సవాన్ని నిర్వహించినటట్లు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న లహరి, పునీత్‌సాయి, హేమ, రేవతిలచే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. వందసంఖ్యలను ఒక్కసారిగా విని వాటిని ధారణ చేయడం, వంద సంఖ్యలను చివర నుంచి మొదటి వరకు తెలియజేసి వాటిని 5, 25 లచే గుణించి లబ్ధాలను తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను కడప జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అభినందించారు. మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహారెడ్డి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు భారతి, మ్యాథ్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

27న సామాజిక తనిఖీ బహిరంగ సభ

తవణంపల్లె: ఉపాధిహామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ ఈ నెల 27వ తేదీన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఏపీఓ లలిత ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద జరిగిన పనులకు ఈ నెల 7వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. బహిరంగ సభకు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, రైతులు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కాలనీ ఎదురుగా ఉన్న శ్రీవారి ఆయుర్వేదిక్ స్పెషాలిటీస్ ఆయుర్వేద నిలయంలో ముంబై రాజస్థాన్ ఔషధాలయ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 200 మందికి పైగా పాల్గొన్నారు. వీరికి తిరుపతి ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల చాళక్య విభాగాధిపతి డాక్టర్ పి జగదీష్ కుమార్ రెడ్డి, తిరుపతి నగరానికి చెందిన ఆయుర్వేద చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.జమున పలు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. శ్రీవారి ఆయుర్వేదిక్ స్పెషాలిటీస్ నిర్వాహకులు ధనంజయరెడ్డి ముంబై రాజస్థాన్ ఔషధాలయ నిర్వహకులు పాల్గొన్నారు.

చిన్మయ మిషన్‌లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లెలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిన్మయ మిషన్‌లో గీతా జయంతి, వైకుంఠ ఏకాదశి, తపోవన్ స్వామి జయంతిని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ మహా విష్ణువు పూజ, శ్రీ గోమాత పూజ, శ్రీ తపోవన్ స్వామి పూజ, గీతామాతా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం విద్యార్థులతో సంపూర్ణ గీతా పారాయణం చేయించారు. అనంతరం అన్నదానం, పుస్తక దానం చేశారు. కార్యక్రమంలో యడమవారిపల్లె, పులిచెర్ల, పీలేరు మండలాలకు చెందిన చిన్మయ మిషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద నృత్యాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో సుజేందర్‌బాబు బృందం ఆధ్వర్యంలో సౌత్‌జోన్ కల్చరల్ ఫెస్ట్–2023 ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాకారులు చేసిన భరతనాట్యం, కూచిపూడి అలరించాయి. కళాకారులను ఏవో ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన సీఎస్‌ఐ చర్చి





క్రిస్మస్‌కు ముస్తాబైన పలమనేరు సీఎస్‌ఐ చర్చి, పలమనేరులోని గుడియాత్తం రోడ్డులో ఉన్న సీఎస్‌ఐ చర్చి

పలమనేరు: పట్టణానికి తలమానికంగా నిలిచి నడిబొడ్డులో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని వున్న సీఎస్‌ఐ చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. ఈ చర్చికి 163 ఏళ్ల చరిత్ర ఉంది. దీన్ని 1860లో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వేలూరు డయాసిస్ అధికారులు అమెరికన్ ఆర్కాట్ మిషన్ ఆధ్వర్యంలో స్కెడ్డర్ ఫ్యామిలీ నిర్మించింది. పలమనేరు నియోజకవర్గంలో ప్రాచీనమైన చర్చిగా దీనికి పేరుంది. దీని పరిధిలో సుమారు 500 కుటుంబాలు, 2 వేలకు పైగా క్రైస్తవులు ప్రార్థనలు చేస్తుంటారు. వీరికి సంబంధించి వంద ఎకరాల బంగ్లాతో పాటు పలు భవంతులున్నాయి. నేటి క్రిస్మస్‌ను సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. రాత్రిపూట ఈ చర్చి విద్యుత్ వెలుగులతో అందరినీ ఆకర్షిస్తోంది. అదే విధంగా పట్టణంలోని గుడియాత్తం రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన సీఎస్‌ఐ చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. సీఎస్‌ఐ సంఘస్తుల సొంత నిధులతో వేలాదిమంది ప్రార్థనలు చేసేలా విశాలమైన భవనంలో చర్చిని నిర్మించారు. చర్చి భవనంపై 120 అడుగుల శిలువ స్తంభాన్ని ఏర్పాటుచేశారు. నేటి క్రిస్మస్‌కు ఇక్కడ భారీ ఏర్పాట్లు చేశారు.

మార్లపల్లెలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మార్లపల్లెలో ఉన్న పాత చర్చి

పుంగనూరు: క్రిస్మస్ వేడుకలకు పుంగనూరు మండలంలోని మార్లపల్లె సిద్ధమైంది. ఇక్కడ 1701లో రాష్ట్రంలోనే మొదటి సారి వెంకటమ్మ బాప్టిజాన్ని స్వీకరించారు. నాటి నుంచి ఇక్కడ క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటున్నారు. 1624లో జింజి పాలకుడైన రామరాజు పుదుచ్చేరిని ఫ్రెంచ్ వ్యాపారులకిచ్చాడు. ఫ్రాన్స్ రాజైన 14వ లూయిస్ భారతదేశంలో క్రైస్తవ మతానికి ప్రాచుర్యం ఇవ్వాలని అనుకున్నాడు. ఇందుకోసం ఆరుగురు జేసుసభ గురువులను పుదుచ్చేరికి పంపారు. 1632 నుంచి 1674 వరకు పుదుచ్చేరిలో కంపూచిన్ గురువులతో జేసుసభ గురువులు కలిసి మెలసి ఉన్నారు. తరువాత జేసుసభ ప్రధాన గురువైన జేసుయిటో కర్ణాటక, జింజి, గోల్కొండ రాజ్యాల్లో జేసుయిట్ మిషన్లు స్థాపించే ప్రయత్నం చేపట్టారు. పాండిచ్చేరి నుంచి పళ్లికొండ, గుడియట్టం (గుడియాత్తం) గుండా రాష్ట్ర సరిహద్దుల్లోని రామసముద్రం మీదుగా 1701 అక్టోబరులో పుంగనూరు చేరుకున్నారు. ఆనాడు పుంగనూరును పాలేగార్ వీరచిక్కరాయలు పరిపాలించేవారు. అతని అనుమతితో జేసుసభ గురువులు క్రైస్తవ మతం గురించి వివరించడం ప్రారంభించారు. ఇలా పుంగనూరు మండలంలోని మార్లపల్లెకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన వెంకటమ్మ వారి బోధనలు విని బాప్టిజాన్ని తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆమె కోరిక మేరకు ముగ్గురు కుమారులు కూడా బాప్టిజాన్ని తీసుకున్నారు. వెంకటమ్మ తన పేరును సవరమ్మగా మార్చుకున్నారు. తెలుగు నాట మొట్టమొదట క్రైస్తవ మతాన్ని స్వీకరించిన పల్లెగా మార్లపల్లె గిన్నిస్ బుక్‌లో కూడా నమోదైంది. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన సవరమ్మ 1701లో చర్చిని నిర్మించారు. మార్లపల్లె గ్రామం వద్ద సవరమ్మ, ఆమె కుమారుల సమాధులు ఉన్నాయి. గ్రామంలో ఇప్పటికి ప్రతి ఏటా క్రిస్మస్‌కు ముందు మూడు రోజులు కానుక మాత తిరునాళ్లను భక్తిప్రపత్తులతో జరుపుకుంటారు.

విద్యార్థులు అన్ని కళల్లోనూ రాణించాలి



బహుమతులందుకున్న చిన్నారులతో బాలోత్సవ్ కమిటీ సభ్యులు

పలమనేరు: విద్యార్థులు అన్ని కళల్లోనూ రాణించినపుడే వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. గంగవరం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పలమనేరు బాలోత్సవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో జిల్లా నుంచి 1200 మంది పిల్లలు 12 రకాల పోటీల్లో పాల్గొన్నారు. నాలుగు విభాగాల నుంచి ఐదుగురు చొప్పున మొత్తం 200 మందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, పుస్తకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగినప్పుడే నైపుణ్యాలు బయటపడతాయని తెలిపారు. పిల్లలు చదువుతో పాటు కళల్లోనూ రాణించాలనే లక్ష్యంతోనే బాలోత్సవ్‌ను నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో నిర్వాహకులు యుగంధర్, ధనుంజయ, సీతారామయ్య, నరేంద్ర, సుదర్శణాచారి, పుష్ప, గురుమూర్తి, వాణి, దీప, మేనక తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును ఆలయ అధికారులకు అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన కరుణాకరన్ ఆలయ అధికారులకు అందించారు. ఆదివారం దాత తన కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం చెక్కును ఆలయ అధికారులకు అందించారు. అంతకుముందు దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో సుప్రీంకోర్టు జడ్జిలు



జస్టిస్ నాగరత్న కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు



జస్టిస్ భట్టి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ వెంకటేశు



నటుడు రాజేంద్రప్రసాద్



జస్టిస్ హేమలేఖకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సుప్రీంకోర్టు జడ్జిలు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎస్వీ భట్టి, జస్టిస్ బీవీ.నాగరత్న, కర్ణాటక హైకోర్టు జడ్జి హేమలేఖ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా ఆలయానికి విచ్చేశారు. అలాగే నటుడు రాజేంద్రప్రసాద్ కూడా విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి రమేష్, చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, ఆర్డీఓ చిన్నయ్య, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఐరాల తహసీల్దార్ సుశీల, సీఐ రవిశంకర్ రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.